శాకంబరిగా ఉజ్జయినీ మహంకాళి




మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని శుక్రవారం శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి అర్చనాది పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు అర్చకులు అరుణ్‌ తెలిపారు. ఈ నెల 28న అమ్మవారి బోనాల జాతర జరుగుతుందన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

గౌతంనగర్‌: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గౌతంనగర్‌లోని శ్రీమల్లన్న దేవాలయంలో కొలువైన శ్రీనల్ల పోచమ్మ దేవి అమ్మవారిని శాకంబరి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ట్రాఫిక్‌ నియంత్రణపై విద్యార్థులకు శిక్షణ



ఉప్పల్‌: ఉప్పల్‌ లిటిల్‌ ఫ్లవర్‌ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌, ట్రాఫిక్‌ ట్రైనింగ్‌ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఆవరణలో అధికారులు ట్రాఫిక్‌ నియంత్రణ పై శిక్షణ ఇచ్చారు. ట్రాఫిక్‌ నియంత్రణలో విద్యార్థుల సేవలను వినియోగించుకునేందుకు పోలీస్‌ శాఖ శ్రద్ధ చూపిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మాక్‌ డ్రిల్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ అధికారులు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ హెచ్‌సీ వేణుగోపాల్‌, కానిస్టేబుల్‌ లక్ష్మీ నారాయణ, కళాశాల ప్రిన్సిపల్‌ జయంతి రెడ్డి, ఫ్యాకల్టీ ఎం ప్రశాంత్‌, నవీన్‌ కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

నాలాలో వ్యర్థాల తొలగింపునకు ఆదేశాలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌, సోనియా గాంధీనగర్‌ ఫేస్‌–1లో నాలా పక్కనున్న ప్రహరీ కూలిపోయినట్లు తెలియడంతో శుక్రవారం కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నాలాలో పడిపోయిన ప్రహరీ వ్యర్థాలను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున నాలా పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట నాగిళ్ల బాల్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, యాదగిరి, బాల్‌నర్సింహ్మా ఉన్నారు.

వైద్యురాలికి సత్కారం



అల్వాల్‌: అల్వాల్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్‌ ప్రసన్నలక్ష్మీ సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అన్నారు. గత పదేళ్లుగా స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్‌గా పని చేస్తున్న ప్రసన్న లక్ష్మి ఆమన్‌గల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది, స్థానికులు ఆమెను ఘనంగా సన్మానించారు. ప్రసన్నలక్ష్మీ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్లు అనగ్‌, జగన్‌, ఆరోగ్య కేంద్రం సిబ్బంది అరుణ, మరియరాణి, వీరయ్య, అబ్రహం, జగన్‌, శ్రీకాంత్‌, మనోహర్‌, స్థానిక నాయకులు సురేందర్‌రెడ్డి, చెట్ల లక్ష్మణ్‌, కన్నాగౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

పరివర్తన్‌ ద్వారా విలువైన సేవలు

సాక్షి, సిటీబ్యూరో: తమ కార్పొరేట్‌ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్‌) కార్యక్రమాల కోసం ఏర్పాటు చేసిన పరివర్తన్‌ ద్వారా రూ.945.31 కోట్లు ఖర్చు చేసి స్వచ్ఛంద సేవలు అందించినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే రూ.125 కోట్లు అదనంగా వ్యయం చేశామన్నారు. నగరంతో పాటు దేశవ్యాప్తంగా విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్య శిక్షణ, పర్యావరణ పరిరక్షణ.. తదితర అంశాలకు సంబంధించి 10లక్షల కుటుంబాలకు తమ సేవలు అందినట్లు వివరించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మల్లాపూర్‌: పరిసరాల పరిశుభ్రత సమష్టి బాధ్యత అని ఎంటామాలజీ సూపర్‌వైజర్‌ కనకరాజు అన్నారు. శుక్రవారం మల్లాపూర్‌ సెయింట్‌ ఆన్స్‌ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్‌ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లలో తులసీ, పూదీనా, సిట్రోనెల్లా, గ్రాస్‌,లెమన్‌ గ్రాస్‌ వంటి మొక్కలను పెంచడం వల్ల దోమలు వ్యాపించవన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏ లక్ష్మీ, బిల్‌ కలెక్టర్‌ ముకేష్‌, ఎంటామాలజీ సిబ్బంది, కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ..అసౌకర్యాల ఒడి!

- కేంద్రాల్లో కానరాని కనీస వసతులు
- సొంత భవనాలు, ఆటస్థలాలు లేవు
- ఆరుబయటే పోషకాహారం
- గర్భిణులు, బాలింతలకు తప్పని ఇబ్బందులు
- మరుగుదొడ్లు లేని కేంద్రాలే అధికం



జవహర్‌నగర్‌: పుట్టిన బిడ్డల ఎదుగుదలకు దోహదపడేలా చిన్నతనం నుంచి పౌష్టికాహారం అందించడంతో పాటు పాఠశాల వాతావరణాన్ని అలవాటు చేసేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను తీసుకొచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో భాగంగా పిల్లలకు అందించాల్సిన విద్య, వారిలో సృజనాత్మకత పెంపొందించాల్సిన అంశాలపై ఒక ప్రణాళికను సైతం రూపొందించింది. దీనిలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య (ప్రీస్కూల్‌) ప్రవేశపెట్టింది. తద్వారా పిల్లలకు ఆట పాటలతో జ్ఞాన సంపద, తెలివితేటలను పెంచాలని ప్రభుత్వం లక్ష్య నిర్దేశం చేసింది. అయితే సంబంధిత కేంద్రాల పనితీరు విషయంలో అధికారుల క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నామమాత్రంగానే ఉందని చెప్పొచ్చు.

- ఐసీడీఎస్‌ ప్రాజెక్ట్‌(అల్వాల్‌) జోన్‌ పరిధిలోని జవహర్‌నగర్‌లో 22 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. దాదాపు 22 మంది పైగా టీచర్లతో పాటు 22 మంది కార్యకర్త(ఆయా)లుగా ఇక్కడ పనిచేస్తున్నారు.
- అంగన్‌వాడీ భవనాలకు సొంతగూడు లేక కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. జవహర్‌నగర్‌లో 22 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 18 కేంద్రాలకు అరకొరగా భవనాలు నిర్మించారు.
- నాలుగు (శివాజీనగర్‌, శ్రీరాంనగర్‌, ఫైరింగ్‌ కట్ట, చంద్రపురికాలనీ) కేంద్రాలకు భవన సదుపాయంలేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు చాలీచాలని గదుల్లో కూర్చోలేక ఆరుబయటే ఉంటున్నారు. చిన్నారులకు ఆట స్థలం కరువైంది. పౌష్టికాహారం సైతం ఆరుబయటే అందిస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు అద్దెగృహాల్లో వర్షపునీరు కారుతోంది.
- దీంతో సరుకులు, రికార్డులను భద్రపరిచేందుకు నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా సెంటర్లలో మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత నిధులతో నిర్మిస్తా



26వ డివిజన్‌లో అంగన్‌వాడీ సెంటర్‌కు స్థలంలేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వీలైనంత త్వరగా అధికారులు స్థల కేటాయింపుపై శ్రద్ధ తీసుకోవాలి. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే తన సొంత డబ్బులతో చిన్నారులకు పార్కు, ఆట వస్తువులతో పాటు నూతన భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మిస్తా.

– పానుగంటి బాబు, 26వ డివిజన్‌ కార్పొరేటర్‌

చిన్నచూపు తగదు



ప్రత్యేక రాష్ట్రంలోనూ ప్రైవేట్‌ పాఠశాలకు ప్రాధాన్యత ఇవ్వడం విడ్డూరంగా ఉంది. చాలా అంగన్‌వాడీ కేంద్రాలు గాలి, నీరు, వెలుతురు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూతన భవనాలు నిర్మించి ఆట స్థలాలను కేటాయించాలి.

– మాధవి, చంద్రపురికాలనీ

మెరుగైన వసతులు కల్పిస్తాం



ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తాం. జవహర్‌నగర్‌లో అద్దెగదుల్లో నడుస్తున్న అంగన్‌వాడీలతోపాటు సబ్‌సెంటర్లకు స్థలాలను గుర్తించాం. గత కౌన్సిల్‌ సమావేశంలో తీర్మానం చేసి అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక నిధులు కేటాయించాం.

– దొంతగాని శాంతికోటేష్‌గౌడ్‌, జవహర్‌నగర్‌ మేయర్‌

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి పూర్ణిమ, ఎంపీడీఓ గ్యామ

కీసర: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు సక్రమంగా అందజేయాలని మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ అన్నారు. శుక్రవారం రాంపల్లిదాయర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు, ప్రభుత్వ పాఠశాలను ఆమె ఎంపీడీఓ గ్యామతో కలిసి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలతో స్టాక్‌ రిజిస్టార్లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధాయుల హాజరు రిజిస్టర్తోపాటు విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. జాఫర్‌గూడలో అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్‌ చక్కగా కిచెన్‌షెడ్‌ను నిర్వహిస్తుండటం పట్ల అధికారులను ఆమె అభినందించారు. పాలకూర, తోటకూర తదితర పోషకాహార పంటలను అంగన్‌వాడీ కేంద్రంలోనే పండించి విద్యార్థులకు వడ్డించడంతోపాటు, గర్భిణులకు పంపిణీ చేయడం చేస్తున్నామని అంగన్‌వాడీ టీచర్‌ అధికారులకు తెలిపారు.

పెండింగ్‌ పనులను పూర్తి చేయండి

అధికారులకు జోనల్‌ కమిషనర్‌ ఆదేశం



థీమ్‌ పార్క్‌లో పెండింగ్‌ పనులపై ఆరా తీస్తున్న జోనల్‌ కమిషనర్‌

మల్లాపూర్‌: మల్లాపూర్‌ డివిజన్‌లో పలు కాలనీల్లో శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఈస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పటేల్‌ స్థానిక కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు బస్తీల్లో స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు వేయాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. కొండిన్య భవన్‌లో పెండింగ్‌ పనులపై ఆరా తీశారు. దోభీఘాట్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. థీమ్‌ పార్క్‌లో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పలు అభివృద్ధి పనులు నిధులు మంజూరు చేయాలని జోనల్‌ కమిషనర్‌కు కార్పొరేటర్‌ దేవేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాప్రా ఇప్యూటీ కమిషనర్‌ ముకుంద్‌రెడ్డి, ఈఈ హరిలాల్‌, డీఈ రవీందర్‌, ఏఈ స్రవంతి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌గా రవి



మల్కాజిగిరి:మల్కాజిగిరి ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్‌.రవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శివశంకర్‌ సైబర్‌ క్రైమ్‌ విభాగానికి బదిలీకాగా ఆయన స్థానంలో రాచకొండ సీపీ కార్యాలయం నుంచి రవి బదిలీపై వచ్చారు. నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన రవి 2012లో సీఐగా పదోన్నతి పొందారు.

వృద్ధుడి దృష్టి మరల్చి రూ. 80 వేలు చోరీ

- నిందితుల అరెస్టు
- సొత్తు రికవరీ

ఉప్పల్‌: ఏటీఎం వద్ద ఓ వృద్ధుడిని దృష్టి మరల్చి రూ. 80 కాజేసిన ఇద్దరు యువకులను పోలీసులు కొన్ని గంటల్లోనే అరెస్ట్‌ చేసి సొత్తును రికవరీ చేసిన సంఘటన శుక్రవారం ఉప్పల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్‌ కల్యాణపురి ప్రాంతానికి చెందిన విశ్రాంత ఉద్యోగి దరావత్‌ రామ్‌ కోఠి గుర్తు తెలియని లింక్‌లను ఓపెన్‌ చేయడం ద్వారా రూ. లక్ష పోగొట్టుకున్నాడు. దీంతో ఆందోళనకు గురైన అతను బ్యాలెన్స్‌ చెక్‌ చేసుకునేందుకు గురువారం ఉప్పల్‌ ప్రశాంత్‌నగర్‌ ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వచ్చాడు. అక్కడే మాటు వేసిన ముగ్గురు యువకులు రామ్‌ కోఠితో మాటలు కలిపి తాము సాయం చేస్తామని నమ్మించారు. ఏటీఎం పిన్‌ నంబర్‌ తెలుసుకుని అతడికి తెలియకుండా రూ. 80 వేల నగదును డ్రా చేసుకుని అక్కడినుంచి పరారయ్యారు. దీనిని గుర్తించిన బాధితుడు ఉప్పల్‌ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు చెప్పిన ఆధారాలతో నిందితులను మిర్యాల గూడ ప్రాంతానికి చెందిన కురుదుల సాయి కిరణ్‌ అలియాస్‌ బుల్లెట్‌ సాయి, బోడుప్పల్‌ బాలాజీ హిల్స్‌కు చెందిన జల్‌పూర్‌ సాయి కిరణ్‌, సుదస్‌ పాల్‌గా గుర్తించారు. బుల్లెట్‌ సాయి, సాయికిరణ్‌లను అరెస్ట్‌ చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామని, పాల్‌ పరారీలో ఉన్నట్లు పోలీసులు వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

మల్కాజిగిరి: 'అమ్మ మాట అంగన్‌వాడీ బాటలో భాగంగా శుక్రవారం ఓల్డ్‌ మల్కాజిగిరి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు ఆశాలత మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు మౌనిక, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

సత్కారం

గౌతంనగర్‌: బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన విఠోభాను శుక్రవారం గౌతంనగర్‌ బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విఠోభా మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి సహాయ సహకారాలు అందిస్తానని, తనకు ఇచ్చిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ శ్రావణ్‌, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్‌, నాయకులు గౌలికర్‌ ఆనంద్‌, బండారి రవి, బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మణ్‌రావు, అమర్‌నాథ్‌, జైశ్రీరామ్‌ కిరణ్‌, నర్సింహచారి, యాదగిరి, గౌతమ్‌, వాసు, బలరామ్‌, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డి సేవలు అభినందనీయం

మౌలాలి : మౌలాలి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా రామచంద్రారెడ్డి చేసిన సేవలు అభినందనీయమని మౌలాలి డివిజన్‌ కార్పొరేటర్‌ గున్నాల సునీతచంద్రశేఖర్‌ యాదవ్‌ అన్నారు. ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం స్థానిక బహర్‌ ఫంక్షన్‌ హాల్‌లో కార్పొరేటర్‌ గున్నాల సునీతా యాదవ్‌, ఎంఈవో శశిధర్‌, ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుభాష్‌నగర్‌ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జులకంటి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢమాసం బోనాలకు కాలనీలు ముస్తాబు




కాప్రా: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల ఉత్సవాలకు కాప్రా డివిజన్‌లోని వివిధ కాలనీలు ముస్తాబవుతున్నాయి. గాంధీనగర్‌లో బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌ శివమణి ముందస్తు చర్యలు చేపట్టారు. ఆయా మార్గాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ మరమ్మతు పనులు చేపట్టారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కార్పొరేటర్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మహేష్‌, బాలమ్మ, మణెమ్మ, నర్సింగ్‌రావు, కృష్ణ, సత్యనారాయణ, శ్రీహరి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్‌లో రుణమాఫీ సంబరాలు



కుషాయిగూడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రూ. లక్ష రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం ఈసీఐఎల్‌ చౌరస్తాలో కాంగ్రెస్‌ శ్రేణులు సంబరాలను నిర్వహించాయి. కార్యక్రమానికి కాంగ్రెస్‌ పార్టీ ఉప్పల్‌ ఇన్‌చార్జ్‌ మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్‌ హాజరై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేయలేని రైతుల రుణమాఫీ కాంగ్రెస్‌ ప్రభుత్వం చేసిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు అంజిరెడ్డి, సీతారాంరెడ్డి, గడ్డం యాదగిరి, పోచయ్యగౌడ్‌, పోలేపాక అంజయ్య, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, విఠల్‌నాయక్‌ పాల్గొన్నారు.

సెల్లార్‌లోకి నీళ్లు రాకుండా నివారించండి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌

బోడుప్పల్‌: 11వ డివిజన్‌ పరిధిలో లక్ష్మిగణపతి కాలనీలోని సెల్లార్‌లోకి వర్షపు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్‌ కొత్త శ్రీవిద్య చక్రపాణిగౌడ్‌ శుక్రవారం కమిషనర్‌ రామలింగంకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ ఫుడ్స్‌ నుంచి వస్తున్న వ్యర్థ జలాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, సుధాకర్‌, రాజు ఉన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



అల్వాల్‌: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముదిరాజ్‌ మహాసభ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా ప్రచార కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, మల్కాజిగిరి మండల అధ్యక్షుడు చెరుకు సాంబరాజ్‌ ముదిరాజ్‌ అన్నారు. ముదిరాజ్‌ కులస్తులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం మల్కాజిగిరి మండల తహసీల్దార్‌ సీతారాంకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ముదిరాజ్‌ కులస్తులను బీసీ–డీ నుండి బీసీ–ఏ లోకి మార్చాలన్నారు. చెరువు, కుంటలు, మత్స్య సంపదపై ముదిరాజ్‌, గంగపుత్ర, గూండ్ల కులాలకు హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించాలని, 75శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలు చేపట్టాలన్నారు. తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, ఈ బోర్డుకు ముదిరాజ్‌ కులస్తులనే చైర్మన్‌గా నియమించాలన్నారు. రాజకీయ రంగంలో ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం పెంచడానికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మల్కాజిగిరి మండల ఉపాధ్యక్షులు గద్వాల వంశీ, ప్రధాన కార్యదర్శి బొల్లు సంపత్‌, కోశాధికారి దండు ప్రసాద్‌, ఉపాధ్యక్షులు కటికల బిక్షపతి, ఊదారి కృష్ణమూర్తి, ప్రచార కార్యదర్శి ఆంజనేయులు, మహేష్‌, రమేష్‌, సురేష్‌, రమేష్‌, పరుశురామ్‌, మల్లేష్‌, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ రాజ్‌ జితేంద్రనాథ్‌

అల్వాల్‌: డివిజన్‌ పరిధిలోని సమస్యల పరిష్కారమే ధ్యేయమని మచ్చబొల్లారం డివిజన్‌ కార్పొరేటర్‌ రాజ్‌ జితేంద్రనాథ్‌ అన్నారు. శుక్రవారం ఆయన పరిధిలోని పలు కాలనీల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నన్న తోట సమీపంలో అంతర్గత రోడ్లు వేయాలని, భూగర్భ డ్రైనేజీ తదితర సమస్యలను కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, కొండయ్య, సంతోష్‌రెడ్డి, సంపత్‌యాదవ్‌, విష్ణు, వెంకటేష్‌, నవీన్‌, శకుంతల, విజయ, రమాదేవి, కాలనీ వాసులు పూర్ణచందర్‌, యాదగిరి, శ్రవణ్‌, దుర్గారెడ్డి, వెంకట్‌రావు, బలరాం, నర్సింగ్‌, రాము తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా



ఉప్పల్‌ భగాయత్‌లో కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

ఉప్పల్‌: అక్రమ నిర్మాణాలపై ఉప్పల్‌ టౌన్‌ ప్లానింగ్‌ విభాగం శుక్రవారం కొరడా ఝులిపించింది. ఉప్పల్‌ భగాయత్‌ లే అవుట్‌లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలతో టౌన్‌ ప్లానింగ్‌ విభాగంపై ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రభుత్వ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో సాక్షాత్తు ఎమ్మెల్యే బహిరంగ విమర్శలు చేసిన సంగతి విధితమే. దీంతో అక్రమ నిర్మాణాలకు రెడ్‌ నోటీసులు జారీ చేసిన టౌన్‌ ప్లానింగ్‌ విభాగం శుక్రవారం కూల్చివేతలు చేపట్టింది. ఈ సందర్భంగా ఉప్పల్‌ భగాయత్‌ లో పలు అక్రమ నిర్మాణాలను అధికారులు నేల మట్టం చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు ఎక్కడున్నా నోటీసులు అందజేసి నేల మట్టం చేస్తామని హెచ్చరించారు. నిర్మాణదారులు విధిగా అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.



వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తుల అదృశ్యం



కళావతి (ఫైల్‌)



నాగేష్‌ (ఫైల్‌)

మల్కాజిగిరి: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన శుక్రవారం మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఐఎన్‌ నగర్‌కు చెందిన నవీన్‌ తల్లి కళావతి (70) గత కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధ పడుతుంది. ఈ నెల 8న నవీన్‌ భార్యతో కలిసి బయటికి వెళ్లి వచ్చేసరికి కళావతి కనిపించలేదు. ఆమె కోసం గాలించినా ఫలితం లేక పోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో...

ఉత్తం నగర్‌ నాయుడు కాంప్లెక్స్‌లో పని చేస్తున్న మంద స్వరూప భర్త నాగేష్‌(37) ఈ నెల 18న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. అతడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657